సాక్షి సంగారెడ్డి

సోమవారం । 22 । మే । 2023



విషాదం నింపిన రోడ్డు ప్రమాదం

అతి వేగం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. నార్సింగి మండలం వల్లూరు శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. 8లో



ఆధార్‌కార్డు ఇవ్వడం లేదని..

కుటుంబ సభ్యులకు ఆధార్ కార్డు ఇవ్వడం లేదని యువకుడు సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈసంఘటన మెదక్ పట్టణంలోని గాంధీనగర్ వీధిలో చోటు చేసుకుంది. 8లో

అందరికీ నెగెటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేయగా అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు.

న్యూస్‌రీల్

ఐలాపూర్ బాధితులకు న్యాయం చేయాలి



బాధితులతో మాట్లాడుతున్న వివిధ సంఘాల నాయకులు

పటాన్‌చెరుటౌన్: ఐలాపూర్ బాధితులకు న్యాయం చేయాలని షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్ ప్రొటెక్షన్ (ఎస్సీఆర్పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్రారం శంకర్, భారత్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు అడ్వకేట్ విజయ్, నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రాత్రి వేళ కొన్ని ఇళ్లను ధ్వంసం చేయడం దారుణమని, గ్రామపంచాయతీ పన్నులు కూడా వసూలు చేసిందని బాధితులు తమ గోడు చెప్పుకున్నారని, ఇది ముమ్మాటికి మానవ హక్కుల ఉల్లంఘనే అని ఆరోపించారు. అధికారులు తమ పరిధి దాటి వ్యవహరిస్తున్నారని, పేదలకు మాత్రమే మానవ హక్కులు, రాజ్యాంగ హక్కులు పనిచేయవా? అని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు వారికి భూములు విక్రయించినా వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని ఐలా భవన్‌లో కిర్బీ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యూనియన్ గౌరవాధ్యక్షుడు మల్లికార్జున్ హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడే సంఘం సీఐటీయూ అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర విధానాలపై పోరాటలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రటరీ వీఎస్ రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): సమగ్ర శిక్ష అభియాన్ కింద మండల వనరుల కేంద్రాల్లో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న సిబ్బంది నిబంధనల మేరకు, షెడ్యూల్ ప్రకారం ఈనెల 23 నుంచి 25వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి, ఎక్స్ అఫీషియో సమగ్ర శిక్ష ఎస్.వేంకటేశ్వర్లు తెలిపారు. సమగ్ర శిక్ష క్రింద మండల వనరుల కేంద్రాల్లో తాత్కాలికంగా కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్పీలు, జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ అనాలసిస్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రస్తుత స్థానం నుంచి ఇతర స్థానాలకు మార్పు కోరే వారు తమ అభ్యర్థనను schooledu.telangana.gov.in/isms లో ఈనెల 23 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని, పూర్తి వివరాలు, మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

సంగారెడ్డి టౌన్: కేజీబీవీ యూఆర్‌ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అశోక్ ఆదివారం పిలుపునిచ్చారు. ప్రభుత్వ అన్ని రకాల సెలవులను వర్తింప చేయడంతో పాటు రెగ్యులర్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు జారీ చేయడంతో పాటు అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు కాశీనాథ్, ఎం.సువర్ణ, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన ఏదీ?



పంటల సాగు విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త (ఫైల్)

- భారీగా తగ్గుతున్న దిగుబడులు
- గతంలో స్కూల్స్‌లో అవగాహన
- రైతు చైతన్య కార్యక్రమాలకు స్వస్తి
- మళ్లీ చేపట్టాలంటున్న విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంది. ఆ కార్యక్రమాలు కొంతకాలం మాత్రమే కొనసాగించడం, అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. నిర్వహిస్తున్న కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నా వాటిని కొనసాగించాల్సిన ప్రభుత్వం విస్మరిస్తోంది.

- రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వ్యవసాయ ఉత్పత్తులను పెంచవలసిన అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా 2010లో అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వ్యవసాయంలో పంటల సాగు విధానంపై అవగాహన కలిపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందుకు జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేసింది.
- అందులో భాగంగా న్యాల్‌కల్, హద్నూర్, మిర్జాపూర్(బి), మెటల్‌కుంట ఇలా చాలా జెడ్పీ పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పంటల సాగు విధానంపై అవగాహన కల్పించారు.
- ఆయా తరగతుల విద్యార్థులకు వ్యవసాయ విధానంలో నాణ్యమైన విత్తనాల ఎంపిక, వానపాములు చేసే మేలు, అంతర పంటలు సాగు, సేంద్రియ ఎరువుల వాడకం, నీటి సంరక్షణ, సూక్ష్మ నీటిసాగు, యంత్రాల వినియోగం, వేపచెట్టు ఉపయోగాలు, రైతుమిత్ర, శత్రు పురుగుల అంశాలు వివరించారు.
- వ్యవసాయానికి సంబంధించిన చార్టులు, టేబుళ్లు, చిత్రాల అవగాహన కల్పించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను గురించి తమ తల్లిదండ్రులకు చెప్పడం ద్వారా వ్యవసాయంలో కొంత పురోగతి కనిపించింది.
- మంచి ఫలితాలు ఇచ్చే కార్యక్రమం కేవలం ఒక ఏడాది మాత్రమే కొనసాగింది. పిల్లలంటే ఇష్టపడని తల్లిదండ్రులుండరు. వారు చెప్పే మంచి కార్యక్రమాలకు తల్లిదండ్రులు తప్పకుండా స్వీకరిస్తారు.
- దేశంలో అధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. అధిక దిగుబడుల కోసం ప్రభుత్వం నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చినప్పటికీ రైతులు వ్యవసాయపట్ల సరైన అవగాహన లేక ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు రాకపోగా నష్టపోవలసిన పరిస్థితులు ఎదురౌవుతున్నాయి.
- రైతుల్లో చైతన్యం కలిగించేందుకు రెవెన్యూ సదస్సులు, రైతు శిక్షణా తరగతులు, రైతు చైతన్య యాత్రలతో పాటు విద్యార్థులకు తరగతి గదుల్లో పంటల సాగు విధానంపై అవగాహన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చింది.
- ఇందులో చాలా పథకాలకు ప్రభుత్వం స్వస్తి పలికింది. పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రద్దు చేసిన ఇతర పథకాలను కొనసాగిస్తే మంచి ఫలితాలు వస్తాయని విద్యావంతులు అభిప్రాయ పడుతున్నారు.

గతంలో మాదిరిగా..



పాఠశాలల్లో వ్యవసాయంలో పంటల సాగు విధానంపై అవగాహన కల్పించే కార్యక్రమం ప్రస్తుతం నిర్వహించడంలేదు. గతంలో మాదిరిగా మళ్లీ నిర్వహించాలి. మేము నేర్చుకున్న వ్యవసాయ పద్ధతులు మా తల్లిదండ్రులకు చెబితే వారు తప్పకుండా పాటిస్తారు. మంచి దిగుబడులు కూడా వస్తాయి.

– అనిల్, విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్, న్యాల్‌కల్

అవగాహన కల్పిస్తున్నాం



అప్పట్లో వ్యవసాయ శాఖలో అధికారుల కొరత ఉండేది. అందుకే అప్పట్లో విద్యార్థులకు అవగాహన కల్పించే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఉండవచ్చు. ప్రస్తుతం మా శాఖలో ఏఈఓలు పెద్ద సంఖ్యలో ఉన్నందున ఆ అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం పంటల సాగు విధానంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

– లావణ్య, ఏఓ, న్యాల్‌కల్

ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తాం



ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తాం. ప్రస్తుతం విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించాలనే నిబంధన లేదు. అవగాహన కల్పిస్తే కొంత మేర ప్రయోజనం ఉంటుంది.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి

సీఎం కప్ క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి టౌన్: జిల్లా స్థాయిలో ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదివారం తెలిపారు. మే 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హ్యాండ్ బాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల నిర్వహణకు ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆయా క్రీడలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. మే 22వ తేదీన సీఎం కప్ క్రీడల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విచ్చేసి క్రీడా పోటీలు ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 5 గంటలకు క్రీడలు ప్రారంభమవుతాయని తెలిపారు.

క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి రామచంద్రాపురంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో నిర్వహించిన జీఎంఆర్ జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవీఆర్ యువసేన ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎం కేసీఆర్ క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సొంత నగదును ప్రథమ బహుమతి గెలిచిన జీఎంఆర్ జట్టుకు రూ.50 వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.30 వేలు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేశ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞాన పరికరాల దిగుమతిపై సుంకాన్ని తగ్గించి రాజీవ్‌గాంధీ ఎంతో ముందుచూపుతో చేపట్టిన సంస్కరణలవల్ల నేడు దేశంలో రక్షణ, విమానయాన సంస్థలు ఎంతో బలోపేతమయ్యాయన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహాన్, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు విఠల్‌రావు, అశోక్‌రెడ్డి, హన్మాండ్లు, సద్దాం, రాజు, శంకర్ పాల్గొన్నారు. మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ నివాసంలో జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ ఆధ్వర్యంలో రాజీవ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తులు

కొమురవెల్లిలో భక్తుల రద్దీ

మల్లన్నను దర్శించుకొని పూజలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం భక్తజన సంద్రమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంత్రాల నుంచి 10వేల మంది భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శనివారం సాయత్రం క్షేత్రానికి చేరుకున్న భక్తులు స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణు చెట్టువద్ద ముడుపులు కట్టారు. కొండపై రేణుక ఎల్లమ్మను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు, చైర్మన్ గీస భిక్షపతి, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయించొద్దు

ఆలయ పరిసరాల్లో దుకాణాదారులు ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్స్, గ్లాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయ పరిసరాల్లో దుకాణాలను ఎంపీఓ మంజులతో కలసి తనిఖీ చేశారు. అనంతరం కొబ్బరికాయలు విక్రయించే దుకాణ యజమానికి బట్టసంచులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సార్ల లత తదితరులు పాల్గొన్నారు.



దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ మల్లికార్జున్ రెడ్డి



గంగిరేణి చెట్టు ప్రాంగణంలో భక్తులు



పట్నాలు వేస్తున్న భక్తులు

హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం



మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ పట్టణ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల ముందు రఘునందన్‌రావు యువకులకు ఎన్నో ఆశలు కల్పించాడని.. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరలేదని ఎద్దేవా చేశారు. అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. నిరుద్యోగ భృతితో పాటు రైతులకు ఎడ్లు, నాగలి ఇస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే తన హామీని నిలుపుకోలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే తన కూతురుతో ఆస్పత్రి పెట్టించి నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని చెప్పి మాట తప్పాడని ఆరోపించారు. రఘునందన్‌రావువి మాటలే తప్ప చేతలు లేవని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సోలిపేట సతీశ్, మనోహర్‌రావు, ఎంపీపీ చిందం సవిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు సుజాత, మండల రైతు బంధు అధ్యక్షుడు లింగారెడ్డి, సర్పంచ్ అశోక్, సహకార సంఘం అధ్యక్షుడు శంకర్‌గౌడ్, ఎంపీటీసీలు సత్యనారాయణ, ఆకుల సుజాత, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బాబు, పట్టణ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పలు పార్టీలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

చలో సంగారెడ్డిని జయప్రదం చేయాలి

కంది(సంగారెడ్డి): మాదిగల హక్కుల కోసం తెలంగాణ ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో సంగారెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షుడు బూడిద నవాజ్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం కందిలో చలో సంగారెడ్డి వాల్ పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకాన్ని దళితులందరికీ వర్తింపజేయాలన్నారు. అర్హులైన దళితులందరికీ మూడెకరాల భూమి, ఇళ్లు లేని వారందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. సోమవారం ఉదయం10గంటలకు కందినుండి సంగారెడ్డి కలెక్టరెట్ వరకు పాదయాత్రగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ నాయకులు రాములు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కంది మండలంలోని ఎద్దుమైలారంలో సర్పంచ్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాల్లో విఫలమయ్యాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మణితేజ, సందీప్, ప్రహ్లాద్, అంజిరెడ్డి, ఆంజనేయులు, వార్డుసభ్యులు శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నాచగిరిలో ప్రత్యేక పూజలు



వ్రతమాచరిస్తున్న దంపతులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ పుష్కరిణి, హరిద్రనదిలో పుణ్యస్నానాలాచరించారు. గర్భగుడిలో స్వామివారికి నిజాభిషేకం జరిపించారు. వ్రతమండపంలో దంపతులు సత్యనారాయణస్వామి వ్రతం చేసుకున్నారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారికి కల్యాణం జరిపించి కల్యాణ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు రద్దీగా మారగా, 5వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. క్షేత్రంలో 10 కల్యాణాలు, 18 నిజాభిషేకాలు, 30 వ్రతాలు జరిగాయని ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

దేవాలయాల అభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జాతరలో ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దేవాలయాలను అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని అండూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మల్లికార్జునస్వామి జాతరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని దేవాలయాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమం నుంచి బాలుడు అదృశ్యం



శ్యామ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: అనాథ ఆశ్రమం నుంచి బాలుడు అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాశ్ కథనం ప్రకారం..షాద్‌నగర్‌కు చెందిన కనగల శ్యామ్(14) తల్లిదండ్రులు లేకపోవడంతో మేనమామ వద్ద ఉంటున్నాడు. వారు బాలుడిని పట్టించుకోకపోవడంతో ఇంటి నుంచి పారిపోయాడు. ఈ నెల 10వ తేదీన రాత్రి సమయంలో తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో తిరుగుతున్నాడు. అనుమానాస్పదంగా కనిపించిన బాలుణ్ని రామచంద్రాపురం పోలీసులు గుర్తించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆ బాలుణ్ని అమీన్‌పూర్ పట్టణంలోని మహిమా మినిస్ట్రీస్ అనాథ శరణాలయంలో ఉంచారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకునే సమయంలో అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడు. ఈ విషయంపై అనాథ శరణాలయం ఇన్‌చార్జి సత్య బహదూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

తహసీల్దార్‌కు తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన తహసీల్దార్ కారు

శివ్వంపేట(నర్సాపూర్): కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న సంఘటనలో మనోహరాబాదు తహసీల్దార్ భిక్షపతికి పెను ప్రమాదం తప్పింది. ఆదివారం విధులు ముగించుకుని మనోహరాబాదు నుంచి సంగారెడ్డికి కారులో వెళ్తున్న క్రమంలో శివ్వంపేట మండలం సికింద్లాపూర్ శివారులో కారు అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో కారు ముందు భాగం ధ్వంసం కాగా అందులో ఉన్న ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో తహసీల్దార్ భిక్షపతికి ఎలాంటి గాయం కాలేదు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురానికి నూతనంగా మంజూరైన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా రామచంద్రాపురం పట్టణంలోని గెస్ట్ హౌస్, లింగంపల్లిలోని పోలీస్ క్వార్టర్స్‌ను ఆదివారం పరిశీలించారు.

విషాదం నింపిన రోడ్డు ప్రమాదం

ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో నలుగురి మృతి



దెబ్బతిన్న కారు



ప్రమాదంనుంచి బయటపడ్డ అభిలాశ్



కవితతో మాట్లాడుతున్న ఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ నర్సింలు

రామాయంపేట(మెదక్): అతి వేగం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. బంధువు దశదినకర్మకు వెలుతున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి..నిజామాబాద్ జిల్లా ఆలూరు మండల కేంద్రానికి చెందిన ఇప్ప శేఖర్, అతని భార్య కవిత, ఇద్దరు కుమారులు అభిలాశ్, యశ్వంత్, కవిత పెద్ద నాన్న గుంటక బాల్‌నర్సయ్య, పెద్దమ్మ మణెమ్మను తీసుకొని జగదేవ్‌పూర్‌లో ఇటీవల మృతిచెందిన తమ బంధువు దశదినకర్మకు ఆటోలో వెళ్తున్నారు. ఆటో యజమాని శేఖర్ ఆటో తోలుతున్న క్రమంలో వెనుకనుంచి అతివేగంగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులు ఇప్ప శేఖర్(45), యశ్వంత్ (9)తోపాటు వృద్ధ దంపతులు బాల్‌నర్సయ్య (75), మణెమ్మ (63) అక్కడికక్కడే మృతిచెందారు. కారు స్పీడ్ తాకిడికి ఆటో తునాతునకలై మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఆటోతోపాటు కారు రోడ్డుకు ఎడమవైపున కిందికి దూసుకపోయాయి. ఈ ప్రమాదంలో శేఖర్ భార్య కవిత తీవ్రంగా గాయపడగా, కుమారుడు అభిలాశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కవిత పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలివచ్చి విలపించారు. ప్రమాదం జరగగానే కారు డ్రైవర్ పారిపోయాడు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఇన్‌చార్జి సీఐ శ్రీధర్, నార్సింగి, నిజాంపేట ఎస్‌ఐలు నర్సింలు, శ్రీనివాసరెడ్డి క్షతగాత్రులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

స్కూటీని ఢీ కొట్టిన క్రేన్

భార్య మృతి, భర్తకు గాయాలు



సోనీ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: స్కూటీని క్రేన్ ఢీ కొట్టిన ఘటనలో భార్య మృతిచెందగా భర్తకు గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామ పరిధిలోని సాయి గీత ఆశ్రమంలో గుడిసె వేసుకొని ఉంటున్న నాగేశ్ అతడి భార్య సోనీ(34)తో కలసి స్కూటీపై లక్డారం నుంచి లక్డారం గేటుకు శనివారం పని నిమిత్తం వస్తుండగా వెనకాల నుంచి వచ్చిన క్రేన్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనకాల కూర్చున్న సోనీ కింద పడగా ఆమెపై నుంచి క్రేన్ వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి భర్త నాగేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుత్ స్తంభంతో పాటు విరిగిన బైకు

అతివేగంగా వచ్చి..

కొల్చారం(నర్సాపూర్): జోగిపేట వైపు నుంచి అతివేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిపడిన సంఘటన రంగంపేట గ్రామ శివారులోని మెదక్-జోగిపేట ప్రధాన రహదారివద్ద ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం..కొంతమంది వ్యక్తులు టీ కొట్టు వద్ద బైక్‌ను ఆపి టీ తాగుతున్నారు. అటుగా వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగిన స్తంభాన్ని కొద్ది దూరం వరకు నెట్టుకపోయింది. ఈ ఘటనలో అక్కడే పార్క్‌చేసిన బైక్‌ను సైతం నెట్టుకపోవడంతో బైక్ పూర్తిగా ముక్కలైంది. డీసీఎం నడిపిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కొల్చారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు.

అదుపు తప్పి..

డివైడర్ మధ్యలోకి దూసుకెళ్లి..



డివైడర్ మధ్యలో ఆగిన లారీ

అల్లాదుర్గం(మెదక్): 161 జాతీయ రహదారిపై లారీ అదుపు తప్పి బ్రిడ్జిని ఢీ కొని డివైడర్ మధ్యలోకి వెళ్లి ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని పల్లెగడ్డ శివారులో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. నాందేడ్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ అతివేగంతో బ్రిడ్జి డివైడర్‌ను ఢీకొని మధ్యలో ఆగిపోయింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని స్థానిక పోలీసులు చెప్పారు.

యువకుడి దారుణ హత్య



శ్రీకాంత్ (ఫైల్)

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఆర్యనగర్‌కు చెందిన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇసామోద్దీన్, జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అమేర్, ఆర్యనగర్‌కు చెందిన శ్రీకాంత్‌లు పరిచయస్తులు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇసామోద్దీన్ దావత్ ఇస్తానని చెప్పి అమేర్, శ్రీకాంత్‌లను మాచిరెడ్డిపల్లి గ్రామానికి తీసుకొని వెళ్లాడు. మార్గ మధ్యలో బీర్లు, బిర్యాని కొనుగోలు చేశారు. అక్కడి నుంచి నేరుగా మాచిరెడ్డిపల్లి గ్రామ శివారు వద్దకు వెళ్లి ఓ కాలి ప్రదేశంలో కూర్చొని ముగ్గురు కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇసామోద్దీన్, ఆమేర్‌లు కలిసి బీరు బాటిళ్లతో శ్రీకాంత్ తలపై, గొంతుపై దాడి చేసి హత్య చేశారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని తల్లి అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి హత్య కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఆటో, స్కూటీ ఢీ..

ఒకరి మృతి..ముగ్గురికి తీవ్ర గాయాలు



కోమలి మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): ఆటో అదుపు తప్పి స్కూటీని ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఓ మహిళ కింద పడి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ ఘటన బొంతపల్లి ప్రధాన రహదారిపై జరిగింది. గుమ్మడిదల ఎస్‌ఐ విజయకృష్ణ కథనం ప్రకారం..వరంగల్ జిల్లా గిర్మాజీపేట గ్రామానికి చెందిన కోమలి(47) దోమడుగులో నివాసం ఉంటూ, అన్నారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తుంది. ఈ నెల 20న విధులు నిర్వహించేందుకు ఆటోలో అన్నారానికి బయలుదేరింది. ఆటో యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ఎదురుగా వస్తున్న స్కూటీ ఆటోను ఢీకొట్టింది. ఆటోలో చివర కూర్చున్న కోమలి రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి గాయాలైనట్లు పోలీసులు చెప్పారు. మృతురాలు కోమలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ

ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



పర్వతం సుధాకర్ మృతదేహం

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి-పెద్దగుండవెల్లి రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో మూలమలుపు వద్ద ఆదివారం సాయంత్రం ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ కొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..దుబ్బాక పట్టణానికి చెందిన పర్వతం సుధాకర్(26) తన బావమర్ది రాములుతో కలిసి బైక్‌పై సిద్దిపేట వైపు వెళ్తుండగా అదే సమయంలో పెద్దగుండవెల్లి నుంచి దుబ్బాక వైపునకు ఆలేటి ప్రసాద్ బైక్‌పై వస్తుండగా పెద్దగుండవెల్లి సబ్‌స్టేషన్ సమీపంలో మూలమలుపు వద్దకు చేరుకోగానే ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. దీంతో సుధాకర్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సుధాకర్ బావమర్ది రాములు, మరో బైక్‌పై వస్తున్న ఆలేటి ప్రసాద్‌లకు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ అక్కడికి చేరుకొని గాయపడ్డ వారిని స్థానికుల సహాయంతో 108లో చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సుధాకర్ మృతదేహాన్ని దుబ్బాక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న కుటుంబీకులు, గాయపడిన ఆలేటిప్రసాద్

నాలుగో అంతస్తు నుంచి పడి బ్యాంకు ఉద్యోగి మృతి



విద్య కేశవరావు మృతదేహం

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు బాల్కనీ నుంచి పడి ఓ బ్యాంకు ఉద్యోగి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..ఖైరతాబాద్ చింతల్ బస్తీకి చెందిన విద్య కేశవరావు(53) ప్రస్తుతం అమీన్‌పూర్‌పరిధిలోని కిష్టారెడ్డి వినాయక టవర్స్, కల్యాణి ఎస్టేట్లో నివాసం ఉంటున్నాడు. బీరంగూడలోని యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. కాగా సంవత్సరం నుంచి అతను క్యాన్సర్‌తో బాధపడుతూ ఆరు నెలలు చికిత్స తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 5గంటల సమయంలో కడుపునొప్పి రావడంతో బాల్కనీలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడి నుంచి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే అతను మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై విద్యార్థి ఆత్మహత్య



పవన్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ బజ్జ నాయక్ కథనం ప్రకారం..హైదరాబాద్ ఉప్పల్‌కి చెందిన రంగయ్య రెండో కుమారుడు పవన్(22) ఐఐఐటీ పూణేలో బీటెక్ ఫైనల్ ఇయర్‌ను ఆన్‌లైన్ ద్వారా ఇంటి వద్ద ఉంటూ చదువుతున్నాడు. కాగా కొంత కాలంగా పవన్ సిగరెట్‌తో పాటు మద్యానికి బానిస అయ్యాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు పవన్‌ను మందలించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పవన్ సిగరెట్ తాగుతుండగా సోదరుడు నవీన్ చూసి మందలించాడు. దీంతో ఇంటి నుంచి బైక్ తీసుకొని పవన్ ఇంద్రేశంలోని ఎస్‌వీ లాడ్జిలో రూమ్ తీసుకొని అక్కడ మద్యం సేవించాడు. అనంతరం తాను చనిపోతానని తన స్నేహితుడు ఆనంద్ ఫోన్‌కు వీడియో పంపాడు. వెంటనే ఈ విషయాన్ని పవన్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం చేరవేశాడు. సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూడగా రూమ్ నెంబర్105లో సీలింగ్ ఫ్యాన్‌కు నైలాన్‌తో ఉరివేసుకొని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు దగ్ధం

తప్పిన ప్రమాదం



కారు దగ్ధమవుతున్న దృశ్యం

రేగోడ్(మెదక్): షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైన సంఘటన మండలంలోని తాటిపల్లి వద్ద ఆదివారం జరిగింది. కారు యజమాని సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వీరయ్యస్వామి తన మనవరాలును నారాయణఖేడ్ ఆస్పత్రికి తీసెకెళ్లి తిరిగి వస్తుండగా రేగోడ్ మండలం తాటిపల్లి వద్దకు రాగానే కారులో నుంచి పొగలు వచ్చాయి. దీంతో పక్కన కారు ఆపేశారు. ఇంతలో మంటలు అంటుకుని కారు దగ్ధమైంది. కారులో ఉన్న ముగ్గురు ప్రాణ పాయం నుంచి బయట పడ్డారని వారు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు అంటుకుని ఉండొచ్చని సురేశ్ తెలిపాడు.

పోరాటాలతోనే పరీక్షలు రాసే అవకాశం



స్వీట్లు తినిపిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జహీరాబాద్ టౌన్: తమ పోరాటంతోనే ఎనిమిది మంది విద్యార్థులకు పదోతరగతి పరీక్షలు రాసే అవకాశం లభించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ యాజమాన్యం నిర్వాహకం వల్ల 8 మంది విద్యార్థులు రెగ్యులర్ పదోతరగతి పరీక్షలు రాయలేకపోయారన్నారు. దశల వారిగా తాము చేసిన పోరాటాల వల్లే అవకాశం లభించిందన్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయం వద్ద ధర్నా, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందచేశామన్నారు. ఈ విషయంలో స్పందించిన ప్రభుత్వం విద్యార్థులకు జూన్‌లో జరగనున్న సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గప్రసాద్, హరీశ్ పాల్గొన్నారు.

బైక్‌కు నిప్పటించిన యువకుడు



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



కాలిపోయిన బైక్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యువకుడు మోటార్ సైకిల్‌పై పెట్రోల్ పోసి నిప్పటించిన సంఘటన భారతినగర్ డివిజన్‌లోని బొంబాయికాలనీలో తెల్లావారు జామున జరిగింది. పోలీసులు కథనం ప్రకారం..బొంబాయికాలనీలో నివాసం ఉండే వెంకటరమణ శుభ కార్యాలకు డెకరేషన్ పనులు చేస్తుంటాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో పనులు ముగించుకొని తన స్కూటీపై ఇంటికి బయలుదేరాడు. బీడీఎల్ అపార్ట్‌మెంట్ సమీపంలో చందు అనే వ్యక్తి పెట్రోల్ సీసాతో బైక్ మీద కూర్చొన్నాడు. చూస్తుండగానే ఓ బైక్ పై పెట్రోల్ పోశాడు. అదే మని ప్రశ్నించిన వెంకటరమణపై అతని స్కూటీ మీద సైతం పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో బైక్ దగ్ధం కాగా బాధితుని పాదాలకు నిప్పంటుకోవడంతో గట్టిగ కేకలు వేయండంతో చందు అక్కడి నుంచి పరారయ్యాడు. వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బొంబాయికాలనీలో..

భారతినగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు 3 ద్వీచక్ర వాహనాలకు పెట్రోల్ పోసి నిప్పంటించారు. వాటి పక్కనే ఉన్న వార్డు సభ్యులు నర్సింహ కారు సైతం స్వల్పంగా కాలిపోయింది. ఈ విషయంలో బాధితులు గోపాలకృష్ణ, శ్రీకాంత్, నిఖిల్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకొని వివరాలు అడిగి తెలుకున్నారు. ఈ సంఘటనకు కారుకులైన వారిని త్వరగా పట్టుకోవాలని పోలీస్ అధికారులను కోరారు.

కుటుంబ సభ్యులకు ఆధార్‌కార్డు ఇవ్వడం లేదని..

విద్యుత్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్



విద్యుత్ టవర్‌పైన సమీర్

మెదక్ మున్సిపాలిటీ: ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా తన కుటుంబ సభ్యులకు పట్టణంలోని గాంధీనగర్ వీధిలో చోటు చేసుకుంది. బాధితుని వివరాల ప్రకారం.. మెదక్ పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న సమీర్(30) ఆటోడ్రైవర్‌గా జీవనంసాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం గాంధీ నగర్ శివారులోని విద్యుత్ టవర్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని టవర్ దిగాలని ఎంత నచ్చచెప్పినా వినిపించుకోలేదు. సుమారు గంటపాటు టవర్ పైన హైడ్రామా కొనసాగింది. కాంగ్రెస్ నాయకుడు మ్యాడం బాలకృష్ణ వచ్చేవరకు టవర్ దిగేది లేదని టవర్ పైనే ఉన్నాడు. స్థానికులు మ్యాడం బాలకృష్ణకు సమాచారం ఇవ్వగా ఆయన సంఘటన స్థలానికి చేరుకొని బాధితునితో మాట్లాడారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పారు. దీంతో సమీర్ కిందకు దిగాడు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండలంలోని వెంకటాపూర్ తండాకు చెందిన రైతు మూడ్ లక్ష్మి ఆదివారం తన ఆవును వ్యవసాయ క్షేత్రంలో మేపుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ తాకి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సుమారు రూ.50వేలు నష్టం వాటిలిందని బాధితురాలు బోరుమని విలపించింది. విషయం తెలుసుకున్న ఖేడ్ నియోజకవర్గ కురుమసంఘం ఉపాధ్యక్షుడు మల్గొండతో పాటు తండా వాసులు పరిశీలించి బాధిత రైతుకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.